క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: విద్యుత్ సౌకర్యం మెరుగు పరిచేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా సోమవారం అయిజ, గట్టు మండలాల్లోని కొన్ని గ్రామాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు టీఎస్ఎస్పీడీసీఎల్ అయిజ సబ్ డివిజన్ ఏడీఈ నీలి గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొత్తినోనిదొడ్డి 33 కేవీ ఫీడర్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు తెలిపారు. అయిజ పట్టణంలోని ఇండస్ట్రియల్ ఫీడర్ కింద కొత్త పరిశ్రమకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు, కొన్ని ప్రదేశాల్లో ఇంటర్మీడియట్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దానివల్ల అయిజ పట్టణంలోని ఉత్తనూరు చౌరస్తా, రాయచూర్ చౌరస్తా, ఆర్అండ్బీ గెస్ట్హౌస్ ప్రాంతంతో పాటు కర్నూలు రోడ్డు మార్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ తెలిపారు. అయిజ మండలంలోని ఉత్తనూరు, చిన్న తాండ్రపాడు, తొత్తినోనిదొడ్డి గ్రామాలకు, గట్టు మండలంలోని ఇందువాసి సబ్ స్టేషన్ పరిధిలోని ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాను రెండు గంటలపాటు నిలిపేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్నగర్ గ్రామంలో ఈ నెల 9వ తేదీన ఉగాది, శ్రీరామ నవమి సందర్భంగా ఓపెన్ ఆల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని మేనిజిమెంట్ సభ్యులు వెంకటేష్నాయక్, దస్తగిరి, సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి, రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.10వేలు గెలిచిన జట్లకు బహుమతిగా అందిజేస్తామన్నారు. ఎంట్రీ ఫీజ్ రూ.800 చెల్లించి టీమ్ను నమోదు చేసుకోవాలని కోరారు.

ఇసుక వాహనాల పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలం లోని కొండపేట సమీపంలోని కృష్ణానది నుంచి టిప్పర్, ట్రాక్టర్ల ద్వారా శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. ఈ క్రమంలో యాక్తాపురం సమీపంలో పోలీసులు తనిఖీ చేసి ఇసుకను తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పీఎస్కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానవపాడు: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఆదివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఆదివారం ఉదయం 5గంటల సమయంలో దాడులు నిర్వహించి కొర్విపాడు శివారు ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ను పట్టుకున్నారు. కర్నూల్ జిల్లా ఎదురూర్ గ్రామానికి చెందిన ఓనర్, డ్రైవర్ తెలుగు హరిబాబు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

తిరుమలలో సంకీర్తనలు



అయిజ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు మండలంలోని గుడుదొడ్డి గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు ఆదివారం తిరుమలలో నిర్వహించిన అఖండ హరి నామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీటీడీ ఆరు భజన మండలి వారికి స్వామివారి దర్శనం కల్పించారు. అదేవిధంగా తీర్థప్రసాదాలు అంజేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు గోపాల్ రెడ్డి, శంకర్, కృష్ణమూర్తి గౌడ్, లక్ష్మన్న, జగన్నాథ్ రెడ్డి, భీముడు, తోట రాముడు పాల్గొన్నారు.

వంతెనపై ప్రయాణం.. ప్రమాదమే



మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడుకు వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ముఖ్యంగా గోకులపాడు, కొర్విపాడు, చంద్రశేఖర్నగర్, శ్రీనగర్, బొంకూర్, కలుకుంట్ల తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. వంతెనపై వెళ్లాలంటే నాలుగు గుంతలు అదుపు తప్పితే వాగులోకి పడే ప్రమాదం ఉంది. రాత్రి సమయంలో మరి ప్రమాదకరంగా ఉంటుంది. చాలా సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎటువంటి ప్రమాదం సంభవించకముందే వంతెనపై ఉన్న గుంతలను పూడ్చాలని మండల ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీల్లో బాల్యానికి భరోసా

- ప్రతినెల పిల్లల బరువు, ఎత్తు కొలతల నమోదు
- నెలకు 30 గుడ్ల సరఫరా
- పౌష్టికాహారలోప నివారణే లక్ష్యం
- ఆరోగ్యంగా ఎదుగుతున్న పిల్లలు



మల్దకల్ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మల్దకల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో పాటు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన అదనపు ఆహారాన్ని సమకూర్చుతోంది. ప్రతినెల బరువు, ఎత్తు కొలతలను నిర్వహిస్తూ పౌష్టికాహార లోప నివారణ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఫలితంగా పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ఒకప్పుడు ఎక్కువ మంది పిల్లలు పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడేవారు, ఆ లోపం ఉన్న పిల్లల్లో ఎదుగుదల లేక ఆయసం, నీరసం వంటి లక్షణాలు కనిపించేవి. సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల పౌష్టికాహార లోపం బారిన పడేవారు. దీంతో చిన్నారులు చదువులపై సైతం శ్రద్ధ చూపలేకపోయేవారు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల ఎదుగుదలను అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించడం, ఆకుకూరలు, పప్పు, గుడ్లతో కూడిన పౌష్టికాహారం అందించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతున్నారు.

గ్రోత్మానిటరింగ్తో తగ్గిన సమస్య

మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతలు మొత్తం 1139 మంది ఉండగా, 5,099 మంది 0–5ఏళ్లలోపు చిన్నారులున్నారు. వారిలో సాధారణ స్థితిలో ఉన్న వారి సంఖ్య 5099 కాగా, పోషణ లోపం స్థితిలో 55మంది, తీవ్ర పోషణ లోపం పరిస్థితిలో 22మంది పిల్లలున్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలో గ్రోత్ మానిటరింగ్ చేస్తున్నారు. దీని కోసం పిల్లలకు ఎత్తు, బరువు, తీయడానికి పరికరాలను కూడా అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించింది. ప్రతి అంగన్వాడీ కార్యకర్త తన పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు తూచి వివరాలను ఐసీడీఎస్ యాప్లో నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలి. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోతే అదనంగా పౌష్టికాహారం పిల్లలకు అందిస్తారు. గ్రోత్ మానిటరింగ్ను అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అంగన్వాడీ సూపర్వైజర్లు, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం ప్రతినెల సరఫరా చేసే గుడ్లు, అదనపు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు బాల్యానికి భరోసాగా నిలుస్తున్నాయని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తును చూస్తున్న అంగన్వాడీ టీచర్

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పౌష్టికాహారం అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి నెల తప్పనిసరిగా గ్రోత్ మానిటరింగ్ నిర్వహిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించడం వల్ల పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించగలుగుతున్నాం.

– కమలాదేవి, సీడీపీఓ ఐసీడీఎస్

దేవునికి ఇష్టంగా జీవించాలి



ధరూరు ఎంబీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: ప్రతి ఒక్కరూ తమ ఇష్టానుసారం కాకుండా దేవుని చిత్తానుసారంగా, దేవునికి ఇష్టంగా జీవించాలని పాస్టర్ సీపీ ప్రసాద్ యూధా అన్నారు. ఏప్రిల్ నెల మొదటి ఆదివారం పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలని కోరారు. సంఘానికి, సమాజానికి కట్టుబడి జీవించాలని సూచించారు. మనం చేసే సత్క్రియలే మనకు మంచి చేస్తాయన్నారు. అనంతరం సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలపై నిర్లక్ష్యమెందుకు?



రాజోళిలో శిథిలావస్థలో పశువుల నీటి తొట్టె



చెన్నిపాడులో బీటలు పారిన నీటి తొట్టె

రాజోళి: పశువులకు తాగు నీరందించే నీటి తొట్టెలపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని పాడి రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం నీటి తొట్టెల అవసరం ఎంతో ఉండగా, కొత్త వాటిని నిర్మించడం వదిలేసి ఉన్న వాటికి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేస్తున్నారని, దీని వల్ల పశువులకు నీరు అందడం లేదని పేర్కొంటున్నారు. గతంలో ఉన్న తొట్టెలతోనే మేతకు వెళ్లే పశువులకు నీరు అందిస్తుండగా, అవి కాలం చెల్లడంతో నీరు అందించేందుకు ఇబ్బందులు తప్పడం లేదని, ప్రస్తుతం వేసవి కాలం అయినప్పటికీ వాటిపై పర్యవేక్షణ లేక గ్రామాల్లో మూగజీవాలకు నీటి కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. అధికారులు దానిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

నిర్వహణ శూన్యం.. తీరని దాహం

మానవపాడు: పశువుల దాహం తీర్చేందుకు గతంలో ఉపాధిహామీ పథకంలో చాలా గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించారు. వాటిని కొన్ని రోజులు వినియోగించారు. తర్వాత నిర్వహణ గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. వేసవి ప్రారంభం కావడంతో పాటు ఎండలు విపరీతంగా ఉండటంతో మూగజీవాల దాహార్తి తీరడం లేదు. నీటి తొట్టెలలో నాణ్యమైన తొట్టెలు లేకపోవడంతో పగులు ఏర్పడి, బీటలు వారాయి. దీంతో మూగజీవాలకు నీటి దాహం తీర్చలేక అలమట్టిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని నీటి దాహార్తిని తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నందిన్నె చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్పోస్ట్ వద్ద తనిఖీ చేపడుతున్నారు. ఆదివారం ఎక్సైజ్ సీఐ వరద శ్రీనివాస్లు, ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు మద్యం తరలిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపించాల్సి ఉంటుందన్నారు. తనిఖీలో కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, ఎస్ఎస్టీం లక్ష్మణ్ ఉన్నారు.



చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న చెక్పోస్ట్ సిబ్బంది

కోటిలింగేశ్వర ఆలయంలో లక్ష పుష్పార్చణ

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా లక్షపుష్పార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం ఎండల తీవ్రత తగ్గి సమస్త జీవరాసులు చల్లగా ఉండాలని కోరుతూ లక్షపుష్పాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న లక్షపుష్పార్చన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

పామిరెడ్డిపల్లిలో..

మాస శివరాత్రిని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టలో వెలసిన శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన భజనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామానికి చెందిన చిట్యాల చెన్నారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మాస శివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం ఉంటుందని భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



రేపటి నుంచి పీపీఎల్4 క్రికెట్ పోటీలు

కొత్తకోట రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో మంగళవారం నుంచి పీపీఎల్ 4 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు యాదగిరిగౌడ్, బీరయ్య, ఆసీఫ్ తెలిపారు. దాతల సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.10వేల నగదుతో పాటు షీల్డ్, రన్నర్గా నిలిచిన జట్టుకు రూ.5వేల నగదుతో పాటు షీల్డ్ అందజేస్తామని వారు తెలిపారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్గేట్ సమీపంలో ఈ నెల 3న స్కూటీ అదుపు తప్పి తీవ్ర గాయాలతో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల ప్రకారం.. కడప జిల్లా బద్వేల్కు చెందిన వెంకట కల్యాణ్ రామ్ (35) ఇంటర్క్యాస్ట్ వివాహం చేసుకుని కర్నూల్ జిల్లాలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 3న కర్నూల్ పట్టణం నుంచి పుల్లూరు టోల్గేట్ సమీపానికి 3.30 గంటల సమయంలో వచ్చి, 7.30 గంటలకు తిరిగి వెళ్తుండగా స్కూటీ అదుపుతప్పి డివైడర్ను ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి సీరియస్గా ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం అతని భార్య షేక్ షబీన్ బాను ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



అయిజ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో దేశం అనేక రకాలుగా అభివృద్ధి చెందిందని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని కిష్టాపురంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి బీజేపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంజి, భీమ్రెడ్డి, ఈదన్న, భీమన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఇక్కడ కూయలే!



ఉండవెల్లి: దేశం మొత్తం ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, ప్రధాన పుణ్యక్షేత్రం అలంపూర్కు వెళ్లే మార్గంలోని బైరాపురం కూడళిలో బస్సుషెల్టర్ వెనుక ప్రచార గుర్తులు, గోడ రాతలు దర్శనమిస్తున్నాయి. చిన్నచిన్న చేతి రాతలే తొలగిస్తున్న తరుణంలో గోడ మీద పెద్ద పెద్ద రాతలు తొలగించడంలో అధికారులు అలసత్వం కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. అనునిత్యం తిరుగుతున్న క్రమంలో కాంగ్రెస్, బీజేపీలకు సంబంధించిన గుర్తులు గోడలపై తొలగించడం మరిచారా? అని వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సంత్ సేవాలాల్ జగదాంబదేవి దీక్ష

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండా, గువ్వలదిన్నె, తూర్పుతండా సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ దేవి మాల 41 రోజుల పాటు దీక్ష చేస్తున్నట్లు స్వాములు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంత్ సేవాలాల్ జగదాంబ దేవి మాల ధరించి పాదయాత్రగా మహరాష్ట్రలోని ఆలయానికి వెళ్లి మొక్కు లు తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సేవలాల్ స్వాములు రవి, తదితరులు పాల్గొ



జన జాతరను విజయవంతం చేద్దాం

అలంపూర్: మహనీయుల జయంతి జన జాతర సదస్సులను విజయవంతం చేద్దామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈదన్నలు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో కేవీపీఎస్, రైతు సంఘం, ప్రజా నాట్యమండలి సంఘాల ఉమ్మడి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సంఘాల నాయకులు మాట్లాడారు. ఈనెల 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయా సంఘాలకు సూచించారు. పూలే, అంబేద్కర్ జన జాతర సదస్సులను జయప్రదం చేయాలని కోరారు. రాజ్యాంగం రిజర్వేషన్లు బీసీ కుల గణన సామాజిక న్యాయం కోసం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మహనీయుల స్ఫూర్తితో మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు నరసింహ, రహీం, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆయా సంఘాల నాయకులు

బుక్కాపూర్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపూర్లోని రైతువేదికలో ఆదివారం వీఎస్టీ కేర్ సంజీవిని, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్టీ కేర్ సంజీవిని డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని ఎలా చూసుకోవాలి అనే అంశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, హరిప్రసాద్, నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బుక్కాపూర్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

మునగాలలో భాగవత సప్తాహం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునగాలలో ఏడు రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాలకు చెందిన ప్రధాన అర్చకులు గ్రామ ప్రజలకు వారం రోజుల పాటు భగవద్గీతలో ఉండే జ్ఞానంతో పాటు అందులో ఉండే వివిధ అంశాలపై సంపూర్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భగవద్గీత భక్తులు, గ్రామ ప్రజలు ఉన్నారు.



మునుగాలలో భాగవత సప్తాహం చేస్తున్న అర్చకులు

మానవత్వం చాటుకున్న స్వచ్ఛంద సంస్థ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లికి చెందిన మాధవయ్యశెట్టి కొంత కాలంగా క్యాన్సర్తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స చేయించుకోవడం కోసం ఆస్పత్రి ఖర్చులకు పెట్టే స్తోమత లేకపోవడంతో కొంత కాలంగా కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా సోషల్ రెస్పాన్సిబిలిటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం బీచుపల్లికి చేరుకొని బాధితున్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి స్వచ్ఛంద సంస్థ నుంచి రూ.48వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అశోక్, మల్లేష్, నర్సింహ, నరేష్, శ్యాంసుందర్, వెంకట్రాముడు, నాగేష్, ఉదయ్, సలీం, రామన్న, మహేష్, రాజు ఉన్నారు.



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ప్రధాన రోడ్లపై ప్రమాద ఘంటికలు



భూంపురం సమీపంలో మలుపు తిరిగిన రోడ్డు

- సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
- మూలమలుపుల్లో అదుపుతప్పుతున్న వాహనాలు

అయిజ: రోడ్ల నిర్మాణం చేపట్టడం, మరమ్మతులు చేపట్టడంతో పాటు రోడ్డు పక్కన మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవించి ప్రయాణికుల ప్రాణాలు కోల్పోతున్నారు. కనీసం మూల ములుపుల వద్ద ముళ్లపొదలను తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనాలు ఢీకొంటున్నాయి. వాహనాలు మూలమలుపుల వద్ద అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ద్విచక్ర వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి.

అనేక చోట్ల మూల మలుపులు..

అయిజ మండల కేంద్రం నుంచి సింధనూరుకు వెళ్లే బీటీ రోడ్డు అనేక చోట్ల మూలమలుపులతో ఉంది. ఉత్తనూరు–భూంపురం గ్రామాల మధ్య బీటీ రోడ్డు అనేక చోట్ల మలుపులు తిరిగి ఉంది. భూంపురం–మూగోనిపల్లి, తొత్తినోనిదొడ్డి, కొత్తూరు, సింధూరు మధ్య రోడ్లు మలుపులు తిరిగి ఉన్నాయి. కొన్నిచోట్ల యూ ఆకారంలో, మరికొన్ని కోట్ల ఎస్ ఆకారంలో రోడ్డు మలుపులు తిరిగి ఉన్నాయి. రోడ్డు మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ముళ్ల పొదలను తొలగించి, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



భూంపురం–సింధనూరు మధ్య ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ రోడ్లు అనేక చోట్ల మూల మలుపులు తిరిగి ఉన్నాయి. రోడ్డు మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. సంబంధిత అధికారులు స్పందించి సూచికి బోర్డులు ఏర్పాటు చేయాలి

– సురేంద్ర స్వామి, సింధనూరు

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి



అయిజ నుంచి సింధనూరుకు నిర్మించిన బీటీ రోడ్డు మలుపులు తిరిగి ఉండడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా చాలా మంది గాయాలపాలయ్యారు. వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారికి మూలమలుపుల గురించి తెలియకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రాణాలను కోల్పోయారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– దర్మల్లి, అయిజ

ముళ్ల పొదలు తొలగించాలి



ఉత్తనూరు– భూంపురానికి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు అనేక చోట్ల మలుపులు తిరిగి ఉంది. మలుపుల వద్ద ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపంచక పోవడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– ఉసేని, భూంపురం

నివేదికలు పంపించాం..

పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుకు ఇరువైపుల సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. అవి ప్రస్తుతం విరిగి పోయాయి. బీటీ రోడ్డును పునర్ నిర్మించేందుకు రెన్యువల్ పెట్టాం. రోడ్డును పునర్ నిర్మించేటప్పుడు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. వాటితో పాటు స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తాం. పెయింటింగ్ వేసి, స్టాండ్స్ ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ వేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– లక్ష్మన్న, పంచాయతీరాజ్ శాఖ ఏఈ